# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 3, డిసెంబర్ 2025


## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్, డిసెంబర్ 02, ప్రభాతవార్త:

4న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకొని జిల్లా కేంద్రంలోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి విభాగాల వారీగా జరుగుతున్న పనులను సమీక్షించిన ఆయన, బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. పర్యటన సందర్భంగా రవాణా నియంత్రణ, ప్రజా ప్రవేశ ఏర్పాట్లు, భద్రతా చర్యలు, వేదిక వద్ద సాంకేతిక వ్యవస్థల అమలు, వైద్య సహాయ బృందాల మోహరింపు వంటి అంశాలను విపులంగా పరిశీలించారు. ఏ తప్పిదానికీ అవకాశం లేకుండా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ రాజేశ్వర్, విభాగాధిపతులు, సంబంధిత సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



# చలి పంజా..

- రికార్డు స్థాయికి పడిపోయిన ఉష్ణోగ్రతలు
- పదేళ్లలో డిసెంబరులో ఇదే అత్యల్పం
- 6.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- వణుకుతున్న ఏజెన్సీ ప్రాంతాలు
- ఇబ్బందుల్లో రైతులు, వాహనదారులు



నస్పూర్/మంచిర్యాల, డిసెంబర్ 2, ప్రభాతవార్త:

మంచిర్యాల జిల్లాను చలిపులి వణికిస్తోంది. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా డిసెంబర్ ఆరంభంలోనే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి పడిపోయాయి. ఆదివారం రాత్రి జిల్లాలోని లక్షెట్టిపేట, బెల్లంపల్లి, నెన్నెల, మందమర్రి ప్రాంతాల్లో 6.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది రాష్ట్రంలోనే అత్యల్పమని, గత దశాబ్ద కాలంలో డిసెంబర్ నెలలో ఇంత తక్కువ ఉష్ణోగ్రత నమోదు కావడం ఇదే తొలిసారని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సాధారణంగా ఈ సీజన్‌లో జిల్లాలో 10 నుంచి 12 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉంటాయి. కానీ, ఉత్తర భారతదేశం నుంచి వీస్తున్న చలి గాలులు, ఆకాశం నిర్మలంగా ఉండటంతో రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పతనమయ్యాయి. ఉదయం 9 గంటల వరకు దట్టమైన పొగమంచు వీడటం లేదు. రోడ్లు, చెట్లు, పొలాలు మంచు దుప్పటి కప్పుకున్నట్లు కనిపిస్తున్నాయి.

2 లో..







## కుటుంబ కలహాలతో దారుణ హత్య

- అన్నను రోకలిబండతో కొట్టి చంపిన తమ్ముడు
- నిందితున్ని అరెస్టు చేసిన పోలీసులు

మందమర్రి, డిసెంబర్ 02, ప్రభాతవార్త

మందమర్రిలో అన్నదమ్ముల మధ్య నెలకొన్న వైరం విషాదకర పరిణామానికి దారితీసింది. తరచూ జరుగుతున్న కుటుంబ కలహాలు చివరకు హత్యగా మారాయి. డిసెంబర్ 1వ తేదీ రాత్రి జరిగిన ఈ ఘటనలో తమ్ముడు రోకలి దుడ్డుతో పెద్దన్నను తలపై తీవ్రంగా కొట్టి హతమార్చాడు. పోలీసుల దర్యాప్తులో నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మందమర్రికి చెందిన మెంద్రపు కుమార్ (34) కూలీ పని చేసి జీవనం సాగిస్తున్నాడు. అతని పెద్ద అన్న మెంద్రపు గోపాల్ (40) పక్క గదిలోనే మిగతా 2లో..



## విత్తన బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకోవాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, డిసెంబర్ 02, ప్రభాతవార్త:

ముసాయిదా విత్తన బిల్లు-2025 రూపకల్పనలో ప్రతి వర్గ అభిప్రాయం కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతులు, విత్తన డీలర్లు, కంపెనీలు, రైతు ఉత్పాదక సంఘాలు, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్న ప్రత్యేక సమావేశాన్ని ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొత్త విత్తన బిల్లు రైతు ప్రయోజనాలను కాపాడేలా, నాణ్యమైన విత్తనాల సరఫరాపై మిగతా 2లో..



## అక్రమ ఆయుధాలతో హత్యాయత్నం

- బీహార్ నుంచి ఆయుధాలు కొనుగోలువ్యాపారిపై హత్యకు ప్రయత్నం
- పోలీసులకు చిక్కిన నిందితుడు

కౌటాల, డిసెంబర్ 2, ప్రభాతవార్త :

అక్రమంగా ఆయుధాలు కొనుగోలు చేసి బెదిరింపులకు పాల్పడి హత్యాయత్నం చేసిన నిందితుని అరెస్టు చేసి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ మిగతా 2లో..





# చలి పంజా..

(మొదటిపేజీ తరువాయి)

దట్టమైన పొగమంచు కారణంగా ఉదయం పూట పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజిబిలిటీ తగ్గడంతో వాహనాలు నడపలేక లైట్లు వేసుకుని వెళ్తున్నారు. బెల్లంపల్లి, మందమర్రి ప్రాంతాల్లో స్వల్ప ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి.

## పశువులకూ తప్పని తిప్పలు..

గ్రామీణ ప్రాంతాల్లో చలి తీవ్రతకు పశువులు, పంటలు దెబ్బతింటున్నాయి. చలికి తట్టుకోలేక పశువుల పాల దిగుబడి సగానికి పడిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులను కాపాడుకునేందుకు గొల్ల సంఘాలు, రైతులు వాటి వద్ద రాత్రిళ్లు మంటలు వేస్తున్నారు. మరోవైపు కూరగాయలు, పొగాకు పంటలు మంచు దెబ్బకు గురవుతున్నాయి.

## మరో మూడు రోజులు ఇంతే..

రానున్న మూడు రోజులు చలి తీవ్రత ఇలాగే కొనసాగుతుందని, ఉష్ణోగ్రతలు మరింత తగ్గి 5-6 డిగ్రీలకు చేరే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. పిల్లలు, వృద్ధులు, ఆస్తమా వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

**మాస్క్ తప్పనిసరి:** బయటకు వెళ్లేవారు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఎన్-95 మాస్క్ ధరించాలి. ఇది కాలుష్య కణాలను శ్వాసకోశంలోకి వెళ్లకుండా అడ్డుకుంటుంది.

**ఉదయం పూట:** విపరీతమైన చలి, పొగమంచు ఉన్నప్పుడు ఉదయం వాకింగ్‌కు వెళ్లకపోవడమే మంచిది. ఎండ వచ్చాక వెళ్లాలి.

**ఇంటి వాతావరణం:** ఇంట్లో దుమ్ము చేరకుండా తడి గుడ్డతో ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

**ఆహారపు అలవాట్లు:** ఫ్రిజ్ వాటర్ తాగకూడదు. గోరువెచ్చని నీరు మాత్రమే తాగాలి. అల్లంతులసి టీ తీసుకోవడం వల్ల గొంతు, శ్వాసనాళాలు శుభ్రపడతాయి. ఉపశమనం కోసం ఆవిరి పట్టడం మంచిది.

## వైద్యుల సలహా..

ఆస్తమా రోగులు ఇన్హేలర్లను నిలిపివేయకూడదని, వైద్యుల సూచన మేరకు రెగ్యులర్‌గా వాడాలని డాక్టర్ శ్రీకాంత్ సూచించారు. శ్వాస తీసుకునేటప్పుడు శబ్దం రావడం, రాత్రిపూట ఆగకుండా దగ్గు రావడం, ఛాతీ బరువుగా లేదా బిగుతుగా అనిపించడం.. వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలని కోరారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే శీతాకాల సమస్యలను సులభంగా జయించవచ్చని తెలిపారు.

## పొగమంచు, కాలుష్యంతో శ్వాసకోశ ముప్పు.. అప్రమత్తత అవసరం


**- నిర్మల పాలిక్లినిక్ వైద్యులు డాక్టర్ జి. శ్రీకాంత్ సూచనలు**



జిల్లాలో శీతాకాలం తీవ్రతకు తోడు, థర్మల్ పవర్ ప్లాంట్ల నుంచి వెలువడే కాలుష్యం కారణంగా శ్వాసకోశ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని మంచిర్యాల నిర్మల పాలిక్లినిక్ కు చెందిన ప్రివెంటివ్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ జి. శ్రీకాంత్ హెచ్చరించారు. ప్రజలకు, ముఖ్యంగా ఆస్తమా బాధితులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. మంచిర్యాల పరిసర ప్రాంతాల్లో థర్మల్ పవర్ ప్లాంట్ల కారణంగా గాలిలో ధూళి, పొగ కణాలు ఎక్కువగా ఉంటాయని, శీతాకాలంలో గాలి సాంద్రత పెరిగి ఈ కాలుష్యం భూమికి దగ్గరగా ఉండిపోతుందని తెలిపారు. దీనివల్ల ఆస్తమా, బ్రాంకైటిస్, సీవోపీడీ వంటి దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వివరించారు.

## అప్పట్లో శ్రమ ఉండేది.. ఇప్పుడు కాలుష్యం పెరిగింది

**- రిటైర్డ్ కార్మికుడు జక్కినబోయిన గోపాల్**



అప్పట్లో నేను భూగర్భ గనిలో పనిచేసే వాడిని.. అప్పుడు కూడా చలి తీవ్రంగానే ఉండేది. కానీ, అప్పటి మంచి ఆహారపు అలవాట్లు, ఒళ్ళు వంచి చేసే పని (శారీరక శ్రమ) మమ్మల్ని కాపాడేవి. ఇప్పుడు వాతావరణం పూర్తిగా కలుషితం అయ్యింది.. అని 80 ఏళ్ల సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి జక్కినబోయిన గోపాల్ తన అనుభవాలను పంచుకున్నారు. సింగరేణి సంస్థలో 40 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలందించి 2005లో ఆయన పదవీ విరమణ పొందారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడు గాలిలో కాలుష్యం పెరిగిపోవడం ఆందోళనకరమన్నారు. పూర్వంతో పోలిస్తే ఇప్పుడు మనుషుల్లో శారీరక శ్రమ తగ్గిందని, దానికి తోడు కలుషిత వాతావరణం వల్ల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత చలికాలంలో వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# కుటుంబ కలహాలతో దారుణ హత్య

(మొదటిపేజీ తరువాయి)



నివసిస్తూ తరచూ మద్యం సేవించి ఇంట్లో గొడవలకు కారణమయ్యేవాడు. గోపాల్ మరియు అతని భార్య గంగా వేధింపులు తాళలేక కుమార్ భార్య చంద్రకళ ఏడాది క్రితం చిన్నారి కుమార్తెతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య విడిపోయేందుకు అన్న గోపాలే కారణమని కుమార్‌లో కక్ష పెరిగింది. ఈ కారణంతో ఇద్దరు అన్నదమ్ముల మధ్య తరచూ వివాదాలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి 7:45 గంటలకు గోపాల్ మరోసారి కుమార్ గదిలోకి వచ్చి గొడవకు దిగాడు. కోపం అదుపు చేయలేకపోయిన కుమార్ ఇంట్లో ఉన్న రోకలి దుడ్డుతో గోపాల్ తలపై రెండుసార్లు గట్టిగా దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావం కారణంగా గోపాల్ అక్కడికక్కడే మృతిచెందాడు.

### పరారీ.. ఆపై అరెస్టు

సమాచారం అందుకున్న మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు అధికారి సిఐ శశిధర్ రెడ్డి నేర స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. ఘటన తర్వాత కుమార్ భయపడి అక్కడి నుంచి పారిపోయాడు. పోలీసులు గాలింపు నిర్వహించి మంగళవారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కుమార్ తన నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. తదుపరి అతడిని రిమాండ్‌కు తరలించినట్లు మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి తెలిపారు.

# విత్తన బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

కట్టుదిట్టమైన నియంత్రణలు ఉండేలా రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయి రైతు నుంచి శాస్త్రవేత్త వరకు అందరి సూచనలు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పారు. అందరి సూచనలను లిఖితపూర్వకంగా సేకరించి రాష్ట్రానికి పంపాలని, నకిలీ విత్తనాలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో పలువురు రైతులు మాట్లాడుతూ, నాణ్యమైన విత్తనాల కొరత, అధిక ధరలు, నకిలీ విత్తనాల విక్రయం, విత్తనం వల్ల పంట నష్టపోయినప్పుడు కంపెనీల బాధ్యత వంటి అంశాలను ప్రస్తావించారు. పంటలు విఫలం అయినప్పుడు రైతుకు రక్షణ కల్పించే విధానాలు బిల్లులో ఉండాలని కోరారు. రైతు ఉత్పాదక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, స్థానిక విత్తన ఉత్పత్తికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలని, నిల్వ, రవాణా సదుపాయాలను విస్తరించాలని కోరారు. చిన్న రైతులకు అందుబాటులో ఉండే విధంగా విత్తన విధానం ఉండాలని సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ,విత్తన తనిఖీ దళాల బలోపేతం, ల్యాబ్‌లలో ఆధునిక పరికరాలు, రైతులకు అవగాహన కార్యక్రమాల అవసరాన్ని వివరించారు. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, తిరీటీలు, విత్తన కంపెనీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఆయుధాలతో హత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. మంగళవారం కుమురం భీం జిల్లా కౌటాల పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం కౌటాల మండలంకు చెందిన ఒక బాధితుడికి గుర్తు తెలియని వ్యక్తి జూన్ 12న ఫోన్ చేసి రూ. 50 లక్షలు మహారాష్ట్రలోని చంద్రపూర్ బస్టాండ్ కు వచ్చి ఇవ్వాలని బెదిరింపులకు గురిచేశాడు. ఇట్టి విషయాన్ని పోలీసులు, మీడియకు తెలిపినచో తుపాకితో కాల్చి చంపుతామని లేఖ రాసి ఫర్టిలైజర్ దుకాణం షట్టర్ వద్ద ఉంచాడు. సెప్టెంబర్ 26న మరోసారి ఫోన్ చేసి డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని బెదిరించాడు. అక్టోబర్ 15న బాధితుడి తమ్ముడు బైకుపై తన ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యలో ఆపడానికి ప్రయత్నించాడు. ఆపకుండా వెళ్ళడంతో పెద్దగా శబ్దం చేసి చంపడానికి ప్రయత్నించాడు. దీంతో ఆ బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు ఇచ్చాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నేరస్తుడైన కౌటి సాండ్గావ్ గ్రామానికి చెందిన కుర్బంకర్ అజయ్(31)ను మంగళవారం ఉదయం ముత్తంపేట క్రాస్ రోడ్ వద్ద కౌటాల పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో అనుమానస్పదంగా కనబడడంతో అతనిని అరెస్ట్ చేసి తన వద్ద ఉన్న ఒక పిస్తోల్, ఒక తపంచా (దేశీ కట్ట), రెండు మ్యాగజిన్ లు, 15 చిన్న బుల్లెట్ లు, ఒక పెద్ద బుల్లెట్, ఐదు ఖాళీ కోకలు, సెల్ ఫోన్, ఒక బైకు, ఇతర వస్తువులు స్వాదీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

## నేరస్తుడు నేరం చేసిన విధానం...

సులువుగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో హిందీ సినిమాలు చూసి ప్రేరణపొంది బాగా డబ్బున్న వారిని బెదిరించి, భయపెట్టి అవసరమైతే చంపైనా ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నట్లు నేరస్తుడు వివరించినట్లు ఎస్పీ తెలిపారు. దీనిలో భాగంగానే నేరస్తుడైన కుర్బంకర్ అజయ్ ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకుని జూన్ 11, 12 తేదీల్లో రాత్రి సమయంలో బెదిరింపు లేఖలు రాసి, 50 లక్షలు ఇవ్వాలని లేనిచో బాధితుడిని, అతని కుటుంబ సభ్యులను చంపుతామని రెండు లెటర్లు రాసి బాధితుడి యొక్క ఫెర్టిలైజర్ షాప్ షెట్టర్ కు పెట్టాడు. కానీ బాధితుడు స్పందించకపోవడంతో యూట్యూబ్ నందు పిస్టోలు, తపంచా లాంటి మారణాయుధాలు బీహార్ లో దొరుకుతాయని తెలుసుకుని అక్కడికి వెళ్ళాడు. అక్కడ బాబు సాహెబ్ కుమార్ అనే వ్యక్తి దగ్గర నుంచి రూ. 55 వేలు చెల్లించి ఒక పిస్టోలు, రెండు మ్యాగజైన్లు దీనికి సంబంధించిన 20 బుల్లెట్లు, ఒక తపంచ, దీనికి సంబంధించిన ఒక బుల్లెట్ కొనుగోలు చేసి అక్కడే షూటింగ్ నేర్చుకొని మూడు బుల్లెట్లు అక్కడే ప్రాక్టీస్ లో ఫైర్ చేసి ఆట్టి ఖాళీ కోకలను తీసుకుని తన ఇంటికి వచ్చాడు. ప్రాణహిత నది ఒడ్డున ఒక బుల్లెట్ గాలి లోకి ఫైర్ చేసి ప్రాక్టీస్ చేశాడు. సెప్టెంబర్ 26 న కాగజ్నగర్ నుండి మహారాష్ట్రకు ట్రైన్ లో వెళ్తూ అందులో ఒక గుర్తు తెలియని వ్యక్తి యొక్క ఫోన్ తీసుకొని బాధితునికి ఫోన్ చేసి డబ్బులు చెల్లించని యెడల చంపేస్తామని బెదిరించాడు. బాధితుడు అప్పటికి స్పందించకపోవడంతో అక్టోబర్ 15న రాత్రి 7 గంటలకు బాధితుడి తమ్ముడిని చంపాలని ఉద్దేశంతో పిస్టోల్లో రెండు బుల్లెట్లు నింపుకొని మార్గమధ్యలో వేచి చూసి ఆయన రాగానే ఒక బుల్లెట్ ఫైర్ చేశాడు. కానీ అది గురి తప్పడంతో అక్కడి నుండి పారిపోయాడు. మళ్లీ డిసెంబర్ 2న బాధితుడు, అతని కుటుంబ సభ్యులు ఫెర్టిలైజర్ షాపుకు ఉదయం వస్తారని తెలుసుకొని ఎలాగైనా కాల్చి చంపాలని ఉద్దేశంతో పిస్టోలు, మూడు బుల్లెట్లు తీసుకొని బైకుపై వెళ్తుండగా మార్గమధ్యలో ఎన్నికల సందర్భంగా వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు పట్టుబడి తన నేరాన్ని ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు.ఈ కేసు దర్యాప్తు కాగజ్నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ ఆధ్వర్యం లో చేపట్టడం జరిగిందనారు. ఈ దర్యాప్తు కు కృషి చేసిన కౌటాల సీఐ సంతోష్ కుమార్, కౌటాల ఎస్ఐ చంద్రశేఖర్, కాగజనగర్ రూరల్ ఎస్ఐ సందీప్, పోలీస్ సిబ్బంది రమేష్, సాయిరాజ్, దుర్గ ప్రసాద్,దీపక్‌లను ఎస్పీ అభినందించారు.

# జాతీయ స్థాయి గుర్తింపు

**ఆదిలాబాద్, డిసెంబర్ 02, ప్రభాతవార్త:**

నీతి ఆయోగ్ విడుదల చేసిన 2025 సెప్టెంబర్ త్రైమాసిక డెల్టా ర్యాంకింగ్స్‌లో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం దేశవ్యాప్తంగా ఉన్న 500 బ్లాక్‌లలో 4వ స్థానం, అలాగే దక్షిణ భారతంలోని జోన్-3లో 1వ ర్యాంక్ సాధించిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా వెల్లడించారు. ఈ అసాధారణ ప్రదర్శనకు గుర్తింపుగా నార్నూర్ మండలానికి రూ.1.5 కోట్లు పురస్కారం లభించిందని తెలిపారు. ఇటువంటి జాతీయ స్థాయి గుర్తింపు మరోసారి రావడం నార్నూర్ మండలాన్ని దేశంలోని అత్యుత్తమ ప్రదర్శన చేసే మండలాల్లో ఒకటిగా నిలబెట్టడమే కాక, ఇది మొత్తం జిల్లా ప్రజలకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. తాజాగా వచ్చిన డెల్టా ర్యాంకింగ్స్‌తో పాటు, నార్నూర్ ఇప్పటి వరకు వివిధ పురస్కారాలు, ప్రోత్సాహకాలను కలిపి మొత్తం రూ.2.78 కోట్లు పొందిందని తెలిపారు. వీటిలో ప్రధానమంత్రి అవార్డు, దేశవ్యాప్తంగా టాప్-5 ప్రదర్శనలో స్థానం, గవర్నర్ అవార్డు, స్టేట్స్ యూజ్-కేస్ చాలెంజ్‌లో 8 లక్షలు, ఎడ్యుకేషన్ విభాగంలో జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్, ఆదేవిధంగా నీతి ఆయోగ్ నుండి 7 ప్రశంసా పురస్కారాలు ఉన్నాయన్నారు. ఈ విజయాలు నార్నూర్ మండలంలోని నిరంతర అభివృద్ధి, శ్రేష్ఠ పాలనతో పాటు ప్రజాకేంద్రీకృత కార్యక్రమాలను ప్రతిబింబంగా నిలుస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.


# నాణ్యతలో నంబర్ వన్... ఉత్పత్తిలోనూ ముందంజ

**- సింగరేణి క్వాలిటీ షీల్డ్ దక్కించుకున్న శ్రీరాంపూర్ ఏరియా - ఈ ఏడాది ఇప్పటి వరకు 80 శాతం బొగ్గు ఉత్పత్తి**

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

**నస్పూర్, డిసెంబర్ 2, ప్రభాతవార్త**

సింగరేణి వ్యాప్తంగా 202425 ఆర్థిక సంవత్సరానికి గాను బొగ్గు నాణ్యతలో శ్రీరాంపూర్ ఏరియా ప్రథమ స్థానంలో నిలిచిందని ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. 75 శాతం క్వాలిటీని సాధించి, ఇటీవల జరిగిన నాణ్యత వారోత్సవాల ముగింపులో సీఎండీ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక షీల్డ్‌ను అందుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఏరియా ప్రగతిని ఆయన వివరించారు. నవంబర్ నెలకు గాను 5,88,800 టన్నుల ఉత్పత్తి లక్ష్యం ఉండగా, 3,43,410 టన్నులు (58 శాతం) సాధించామని జీఎం తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు (నవంబర్ 30 నాటికి) 42.41 లక్షల టన్నుల లక్ష్యానికి గాను.. 33.75 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 80 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. ముఖ్యంగా ఆర్‌కే న్యూ టెక్ గని 113 శాతంతో రికార్డు సృష్టించిందని అభినందించారు. గత నెలలో ఉత్పత్తిని పెంచే చర్యల్లో భాగంగా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో రూ. 5 కోట్ల 26 లక్షల విలువైన 75 టన్నుల భారీ హైడ్రాలిక్ క్రేన్‌ను, అలాగే సెక్యూరిటీ విభాగం కోసం రూ. 15 లక్షలతో నిర్మించిన నూతన కార్యాలయ సముదాయాన్ని (ఆఫీస్, రెస్ట్ రూమ్స్) ప్రారంభించినట్లు తెలిపారు. కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, ఇప్పటి వరకు మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా 4,333 మంది దరఖాస్తు చేసుకోగా.. అర్హులైన 3,791 మంది వారసులకు కారుణ్య నియామక ఉత్తర్వులు అందించామని చెప్పారు. మరో 275 మందికి రూ. 25 లక్షల చొప్పున లంసమ్ మొత్తం చెల్లించామని, 20 మందికి ఎంఎంసీ (నెలవారీ పెన్షన్) కింద రూ. 39,069 అందిస్తున్నామని వివరించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని గనుల్లో ఈ ఏడాది జనవరి 1 నుంచి అక్టోబర్ 31 వరకు కనీసం 150 మస్టర్లు (హాజరు) లేని ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించి, విధులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని సూచించారు. అలాగే జీఎం కార్యాలయంలోని మహిళా ఉద్యోగులకు షీ టీం సేవలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈఎస్ఐ ఒప్పంద కార్మికుల నమోదు, అమలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్‌కే న్యూటెక్, ఆర్‌కే6 గనుల్లో జ5 స్టార్ రేటింగ్‌చ కోసం బెల్లంపల్లి, రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎంలు, శ్రీరాంపూర్ జీఎం కలిసి ఇన్స్పెక్షన్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.



# ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

**- బెల్లంపల్లి ఏసిపి రవికుమార్**



**తాండూర్, డిసెంబర్ 2 ప్రభాతవార్త :**

సర్పంచ్, వార్డు ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అందరు సహకరించాలని బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ అన్నారు. మండలంలో సమస్యాత్మకమైన తాండూర్, అచ్చులాపూర్ పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఏసీపీ పరిశీలించారు. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పని హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే వీడియోలు పోస్ట్ చేస్తే, గ్రూప్ అడ్మిన్ లపై చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, ప్రతి ఓటరు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట సిఐ దేవయ్య, ఎస్సై కిరణ్ కుమార్ ఉన్నారు.

# రోడ్డు వెడల్పు బాధితుల గోడు పట్టించుకోరా..

**- బెల్లంపల్లి పట్టణ రోడ్డు వెడల్పు బాధితుల పోరాట కమిటీ - 2013 భూ సేకరణ చట్టానికి విరుద్ధంగా కూల్చివేతలు**

**బెల్లంపల్లి, డిసెంబర్ 02, ప్రభాతవార్త**



బెల్లంపల్లి పట్టణంలో మున్సిపల్ అధికారులు రోడ్డు వెడల్పు పేరుతో గత నెల రోజులుగా చేపడుతున్న కూల్చివేతలు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకే రవి, రోడ్డు వెడల్పు బాధితుల పోరాట కమిటీ కన్వీనర్ చల్లూరి దేవదాస్ తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు ఈ రోజు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

### పట్టణంలో ఎక్కడికక్కడ మార్కింగ్‌లు - ప్రజల్లో భయాందోళన

బాలాజీ థియేటర్ నుంచి కన్నాలబస్తీ బ్రిడ్జి వరకు, పాత బస్టాండ్ నుంచి శ్రీ సరస్వతి శిశు మందిర్ వరకు, మార్కెట్ నుంచి కాలేజ్ రోడ్డువరకు ఇండ్లు–దుకాణాలపై మార్కింగ్‌లు పెట్టడం వల్ల ప్రజలు, చిన్నచిన్న వ్యాపారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఇటీవలి రోజుల్లో పోలీస్ బలగాలతో కలిసి జెసిపిలను తీసుకొచ్చి బలవంతంగా షాపులు కూల్చివేయడం మరింత కలకలం రేపింది. వేలాది చిన్న వ్యాపారులు జీవనోపాధి కోల్పోయిన దుస్థితి. కూల్చివేతల నేపథ్యంలో చిన్న దుకాణాదారులు చికెన్, చేపల, కూరగాయల వ్యాపారులు, టీ–టిఫిన్, కిరాణా దుకాణాలు, బార్ షాపులు, హోటళ్లతోపాటు తోపుడు బండ్లవారు, పూల అమ్మేవారు, చెప్పులు కుట్టే వారు తమ జీవనాధారాన్ని పూర్తిగా కోల్పోయి వేలాది మంది నిరాశ్రయులయ్యారని బాధితులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నెలరోజులు గడిచినా – బాధితులను ఆదుకునే చర్యలు మున్సిపల్ అధికారులు చేపట్టలేదని ఆరోపించారు.

### 2013 భూ సేకరణ చట్టం ఉల్లంఘన

### - పోరాట కమిటీ

భూ సేకరణ చట్టం–2013 ప్రకారం నష్టపరిహారం, పునరావాసం ప్రకటించకుండా నేరుగా కూల్చివేతలు చేపట్టడం చట్టవిరుద్ధమని అన్నారు. అధికారుల దౌర్జన్యం ఆపాలని పోరాట కమిటీ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి జనాభా తగ్గడానికి కారణం ఇదే మాస్టర్ ప్లాన్ పేరుతో గతంలో కూడా పలుమార్లు కూల్చివేతల కారణంగా ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లిపోయారని, ఇప్పుడు మరోసారి అదే పరిస్థితి పునరావృతమవుతోందని కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా పోరాట కమిటీ ప్రధాన డిమాండ్లు చేశారు. అందులో .. తక్షణమే కూల్చివేతలు, బెదిరింపులు నిలిపివేయాలి. పట్టణ మాస్టర్ ప్లాన్‌ను బహిర్గతం చేసి ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. పట్టణ అభివృద్ధిపై అచలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. నష్టపోయిన బాధితులకు భూ సేకరణ చట్టం–2013 ప్రకారం నష్టపరిహారం, పునరావాసం కల్పించాలి. కూల్చివేతలకు బదులుగా ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గాలను అన్వేషించాలి. ఈ కార్యక్రమంలో ఎండీ గౌస్, ఎం. సురేష్, పెద్ది రాము, డి. రమేష్, డి. శ్రావణ్, ఎం. శంకర్, జె. హన్మన్, గుంపుల శంకర్, గోదావరి లక్ష్మి, ఎస్‌కే జరీనా, అన సూరాజ్, పీ. రమేష్, ఈ. సంతోష్, ఎస్. కుమార్, రామకృష్ణ, ఎస్. రాజన్న తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ బన్సిలాల్

## పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**- చెన్నూర్ రూరల్ సీఐ బన్సిలాల్**

**వేమనపల్లి, డిసెంబర్ 02, ప్రభాతవార్త**

గ్రామాలలో ప్రజలు గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చెన్నూర్ రూరల్ సీఐ బన్సిలాల్ సూచించారు. మండలంలోని బుయ్యారం గ్రామంలో ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఎన్నికలలో ఘర్షణలకు తావు లేకుండా జారుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల, ఎక్సైజ్ శాఖతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, 21 గుడుంబా తయారీ కేంద్రాలను గుర్తించి వాటిపై దాడి చేసి, దాదాపు 3500 లీటర్ల గుడుంబా (ఐడి లిక్కర్)ను ధ్వంసం చేయడం జరిగిందని అన్నారు. బుయ్యారం గ్రామ నివాసితులతో మాట్లాడుతూ అక్రమ మద్యం తయారు చేయడం అమ్మడం చట్ట ప్రకారం శిక్షార్హమైన నేరం అని తెలియజేశారు. అక్రమ మద్యం ఉత్పత్తిలో పాల్గొన్న ఎవరైనా వారిపై కేసులు నమోదు చేస్తామని వారిని హెచ్చరించారు. వీరితో నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, పోలీసు సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.



## మంత్రి జూపల్లి కృష్ణా రావును సన్మానించిన మాజీ డిసిసి అధ్యక్షుడు

**నిర్మల్ పట్టణం, డిసెంబర్ 02, ప్రభాతవార్త**

ఈ నెల 4వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉండగా ఏర్పాట్లను పరిశీలించడానికి నిర్మల్‌కు విచ్చేసిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణ రావును మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలలో పాటించాల్సిన విధానాలను, ముఖ్యమంత్రి సభ విజయవంతం చేయడానికి కృషి చేయాలని తెలిపారు. మాజీ డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు, జి షాన్ అలీ, ఇతర సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

**వేమనపల్లి, డిసెంబర్ 2, ప్రభాతవార్త**

ఎన్నికల నేపథ్యంలో మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నుంచి అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.9 వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం వేమనపల్లి నుంచి గొర్లపల్లి గ్రామానికి చెందిన అరిగెల ప్రభాకర్ గౌడ్, అరిగెల సంజీవ్ గౌడ్ అనే ఇద్దరు వ్యక్తులు టీఎస్ 19 డి 2089 నెంబర్ గల ద్విచక్ర వాహనంపై మద్యాన్ని తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు తమ సిబ్బంది మాటు వేసి పట్టుకోవడం జరిగిందని, వారి వద్ద నుంచి మద్యం, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.



## 4న కొణిజేటి రోశయ్య వర్ధంతి వేడుకలు

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్, డిసెంబర్ 2, ప్రభాతవార్త:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్ గా సేవలు అందించిన కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 4న జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మంగళవారం తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.



## సైబర్ క్రైమ్ మోసాలపై జాగ్రత్త వహించాలి

**నేరడిగొండ, డిసెంబర్ 2, ప్రభాతవార్త:**

ప్రస్తుతం కొత్తరకాల మోసాలతో సైబర్ క్రైమ్ నేరాలు జరుగుతున్నాయని వాటిపై తగు జాగ్రత్త వహించాలని ఆర్థిక అక్షరాస్యత ఆర్బీఐ కౌన్సిలర్ వన్ని సంతోష్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశ కార్యకర్తలకు, ఆరోగ్య కేంద్ర సిబ్బందికి సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత కాల్స్ వస్తే సమాచార వివరాలు ఇవ్వకుండ జాగ్రత్తగా ఉండాలన్నారు. వాట్సాప్ గ్రూప్లో ఏపీకే లింక్, ఒటీపీలు ఎవరికీ షేర్ చేయవద్దని సూచించారు. అటువంటి ఫోన్ కాల్స్ వస్తే 1990 కు కాల్చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సద్దాం, కౌన్సిలర్ అరవింద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




## మోడల్ స్కూల్‌ని పర్యవేక్షించిన నోడల్ అధికారి

**బోథ్, డిసెంబర్ 02, ప్రభాతవార్త:**

మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో మంగళవారం అదిలాబాద్ జిల్లా నోడల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ ప్రసాద్ పర్యవేక్షణ చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధన విధానాలు, ప్రయోగశాలల నిర్వహణ, విద్యా సంబంధిత రికార్డులు, విద్యార్థుల ప్రగతి వివరాలను శ్రద్ధగా పరిశీలించారు. పాఠశాల అకాడమిక్ కార్యక్రమాల అమలు, రికార్డుల ప్రామాణికత, విద్యార్థుల ప్రగతి తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ప్రిన్సిపల్, విద్యా ప్రమాణాల మెరుగుదల దిశగా జరుగుతున్న ప్రయత్నాలను అభినందించారు. పర్యవేక్షణ సందర్భంగా పాఠశాల వాతావరణం, నిర్వహణ తీరు కూడా పరిశీలించగా, మొత్తం విద్యా కార్యకలాపాలపైన సానుకూల అభిప్రాయం వ్యక్తమైంది.

## వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ పూజారి మృతి

**ఉట్నూర్, డిసెంబర్ 02, ప్రభాతవార్త:**



పట్టణంలోని పాత ఉట్నూర్ వీర భ్రహ్మేంద్ర స్వామి ఆలయ పూజారి గన్నోజీ రాజేశ్వర్ మంగళవారం అనారోగ్యంతో అస్వస్థతకు గురై మరణించారు. విరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంతో పాటు స్థానిక రామాలయంలో 30 ఏళ్లుగా రాజేశ్వర్ పూజారిగా సేవాలందిచారు. నిత్యం భక్తులకు అన్ని విదల సహాయ సహకారాలు అందించే పూజారి మృతి చెందడంతో స్థానికులు ఆవేదనవ్యక్తం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను శత శాతం ప్రారంభించాలి

**★ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్, డిసెంబర్ 2, ప్రభాతవార్త:**



నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్ల నిర్మాణాలను శత శాతం ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి ప్రకాష్ రావు లతో కలిసి కాగజ్ నగర్, ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో చేపట్టవలసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై మున్సిపల్, గృహ నిర్మాణ, మున్సిపల్ వార్డు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ప్రతి లబ్ధిదారులు ప్రారంభించేలా మున్సిపల్, గృహ నిర్మాణ, మున్సిపల్ వార్డు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. కాగజ్ నగర్ మున్సిపాలిటీకి 498 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, ఇప్పటివరకు 391 ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించడం జరిగిందని, మిగిలిన 107 మంది లబ్ధిదారులు పనులు చేపట్టలేదని తెలిపారు. దీనికి గల కారణాలను తెలుసుకొని పనులు ప్రారంభించేందుకు మెప్మా క్రింద మహిళ సంఘాల నుండి రుణ సదుపాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి 458 ఇండ్లు మంజూరు కాగా ఇంకా 1505 ఇండ్లను ప్రారంభించలేదని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ఈ నెల 20వ తేదీలోగా పూర్తి అయిన ఇండ్లకు ప్రారంభోత్సవాలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డిఈ. వేణుగోపాల్, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, వార్డు అధికారులు పాల్గొన్నారు.




నియామాక పత్రాలు అందుకుంటున్న సుగుణక్క

## కొమురం భీం డీసీసీ అధ్యక్షురాలిగా నియామక పత్రం అందుకున్న ఆత్రం సుగుణక్క

**ఆసిఫాబాద్, డిసెంబర్ 2, ప్రభాతవార్త:**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా నూతనంగా నియమితులైన సుగుణక్కకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ చేతుల మీదుగా అధికారిక నియామక పత్రం అందజేశారు. మంగళవారం హైదరాబాదులోని గాంధీ భవన్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వం నాపై ఉంచిన నమ్మకానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. డీసీసీ అధ్యక్షురాలిగా నాకు వచ్చిన ఈ బాధ్యతను శ్రద్ధగా, నిజాయితీగా నిర్వర్తిస్తానని, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం జిల్లా వ్యాప్తంగా నాయకులను, కార్యకర్తలను కలుపుకొని పోతూ ముందుకు సాగుతానన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సమన్వయంతో కృషి చేస్తామన్నారు.

## శాంతిగని మైన్‌లో ఏఐటీయూసీ నేతల ఇన్స్పెక్షన్

**- 25 రోజులుగా నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తిపై సమీక్ష**

**బెల్లంపల్లి, డిసెంబర్ 2, ప్రభాతవార్త**




బెల్లంపల్లి ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్ నాయకత్వంలో శాంతిగని మైన్‌లో మంగళవారం ఇన్స్పెక్షన్ నిర్వహించారు. గత 25 రోజులుగా బొగ్గు ప్రొడక్షన్ నిలిచిపోయిన నేపథ్యంలో మైన్ సేఫ్టీ పరిస్థితులు, పని వాతావరణం, ఉత్పత్తి నిలిచిన కారణాలు తెలుసుకోవడం కోసం మైన్‌లోపలికి దిగారు. ఈ సందర్భంగా దాగం మల్లేష్ మైన్ కార్మికులతో, అధికారులతో మాట్లాడి బొగ్గు ఉత్పత్తిని త్వరితగతిన పునఃప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సేఫ్టీ చర్యలు మరింత బలోపేతం చేసి, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కూడా కోరారు. ఏఐటియుసి నాయకత్వం బొగ్గు ఉత్పత్తి నిలిచిపోవడం కార్మికులకు, సంస్థకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని పేర్కొంటూ సమస్యలను పరిష్కరించి మైన్ కార్యకలాపాలు తక్షణమే పునరుద్ధరించాలని కోరింది. ఈ ఇన్స్పెక్షన్‌లో శాంతిగని మైన్ ఫిట్ సెక్రటరీ దాసరి తిరుపతి గౌడ్, బెల్లంపల్లి బ్రాంచ్ ఉపాధ్యక్షులు బియ్యాల వెంకటస్వామి, కాశీపేట-2 పిట్ సెక్రటరీ శ్రీనివాస్, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మంతెన రమేష్, వర్క్‌మెన్ ఇన్స్పెక్టర్ పొట్ల రాయలింగు, మైన్స్ కమిటీ సభ్యుడు దాడి రమేష్ పాల్గొన్నారు.

## ముగిసిన రెండో విడత నామినేషన్ల ప్రక్రియ

**తాండూర్, డిసెంబర్ 2, ప్రభాతవార్త**

మండలంలో ఈ నెల14న రెండో విడతలో జరిగే సర్పంచ్, వార్డు స్థానాలలో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. తాండూర్ మండలంలోని 15 గ్రామ పంచాయతీలు, 144 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 30న మొదటిరోజు సర్పంచ్ కు 8, వార్డు స్థానాలకు 10, ఈ నెల 1న రెండో రోజు సర్పంచ్ కు 45, వార్డు స్థానాలకు 145 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు మంగళవారం చివరి రోజు కావడంతో సర్పంచ్, వార్డు స్థానాలకు భారీగా నామినేషన్ దాఖలు అయ్యాయి. రాత్రి 7 గంటలు దాటిన నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్ కేంద్రాల వద్ద మద్దతుదారులతో అభ్యర్థులు వేచి ఉన్నారు.



నామినేషన్లు దాఖలు చేసేందుకు వేచి ఉన్న అభ్యర్థులు

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**పెంచికల్‌పేట్, డిసెంబర్ 02, ప్రభాతవార్త**

పెంచికల్ పేట్ మండలంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం ఐకేపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని మండల ఇంచార్జ్ వ్యవసాయ అధికారి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ సీజన్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో వరి కొనుగోలు జరిగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల నుంచి మంచి నాణ్యత గల వరిని ప్రభుత్వ మద్దత్తు ధరకు కొనుగోలు చేస్తామని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ఐకేపి సిబ్బంది భాద్యతగా వ్యవహారించాలని సూచించారు. కేంద్రంలో తూకాల యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు వంటి అవసరమైన సదుపాయలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపి ఎపిఎం అశోక్, ఏఈఓ వంశీ, సీసీ రైతులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలతో నాయకులు

## రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

### - బీఆర్ఎస్ తిర్యాని మండల అధ్యక్షుడు హన్మండ్ల జగదీష్

**తిర్యాని, డిసెంబర్ 2, ప్రభాతవార్త;**

తిర్యాని మండలంలో రానున్న పంచాయితీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అన్ని స్థానాల్లో ఘనవిజయం సాధిస్తుందని తిర్యాని మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు హన్మండ్ల జగదీష్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని కైరిగూడ, మానిక్యాపూర్, లక్ష్మిపూర్, తదితర గ్రామాలకు చెందిన సుమారు వంద మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మండ్ల జగదీష్ వారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాము ఏ గ్రామానికి వెళ్ళిన బీఆర్ఎస్ పార్టీకి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. కాంగ్రేస్ మోసపూరిత హమీలను ప్రజలు గుర్తించారని దీంతోనే చాలమంది బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. పేదల సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ ధ్యేయమన్నారు. రాబోయే పంచాయితీ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి బీఆర్ఎస్ పార్టీ బలపరిచే అభ్యర్థులను భారి మెజార్టితో గెలుపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజి జెడ్పిటీసి ఆత్రం చంద్రశేఖర్, మండల బీఆర్ఎస్ నాయకులు ముత్యం రాజయ్య, గాయేంగి మల్లేష్, పోలాస రమేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




## చెరువును సందర్శించిన శిక్షణ ఉద్యోగులు

**మామడ, డిసెంబర్ 30, ప్రభాతవార్త:**

మండలంలో దిమ్మదుర్తి తుర్కం చెరువు, నల్దుర్తి వెంగన్న చెరువును 40మంది ఉద్యోగ శిక్షణ ఎఫ్‌బిఓలు సందర్శించి అక్కడ గల వివిధ రకాల చెట్ల గుర్తింపు లక్షణాలను, శాస్త్రీయ నామాలను తెలుసుకున్నారు. వెంకన్న చెరువులుకి వచ్చే 88 జాతుల పక్షుల వివరాలను తెలుసుకున్నారు. ఎకో టూరిజం ఆవశ్యకతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అటవీ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ అశోక్ కుమార్, ఎఫ్‌ఆర్ఓ శ్రీనివాసరావు, ఎఫ్‌ఎస్ఓ శ్రీనివాస, ఎఫ్‌బిఓలు సరిత లక్ష్మీనారాయణ, రాజులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీత సేవాదాస్‌కు సన్మానం

**ఉట్నూర్, డిసెంబర్ 02, ప్రభాతవార్త:**

బెస్ట్ ఫోటో గ్రాఫర్‌గా హైదరాబాద్‌లోని బిర్లా మ్యూజిమ్‌లో నంది అవార్డు అందుకున్న చవాన్ సేవాదాస్‌కి మంగళవారం ఉట్నూర్‌లో అశోక్, బాలాజీలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫోటోలతో పాటు శ్రీ సేవా ఫౌండేషన్ ద్వారా కూడా ప్రజలకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నా వ్యక్తి గొప్పదన్నారు. ఇలాంటి మరిఎన్నో అవార్డులు తీసుకోవాలని కోరారు.



### శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై

# చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**✪ జిల్లా ఎస్పీ నితికా పంత్ ✪ చింతలమానేపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ**

**చింతలమానేపల్లి, డిసెంబర్ 2, ప్రభాతవార్త**

జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, నమోదు చేసిన రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, స్టేషన్ హాజరు రిజిస్టర్, స్టేషన్ శుభ్రత తదితర విభాగాలను పరిశీలించారు. ఎస్పీ ఎస్‌హెచ్ఓ నరేష్, స్టేషన్ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు సిబ్బందీ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో చట్టవ్యతిరేకచర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదిదారుడితో, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో లా అండ్ ఆర్డర్ విషయంలో రాత్రిపూట పర్యవేక్షణ, పికెటింగ్, పెట్రోలింగ్ ను కచ్చితంగా కొనసాగించాలని సూచించారు. ప్రజా భద్రతకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట కాగజనగర్ డిఎస్పీ వాహిదుద్దీన్, కౌటాల సీఐ సంతోష్ కుమార్ ఉన్నారు.




వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ నితికా పంత్

## నామినేషన్ కేంద్రాల పరిశీలన

**సారంగాపూర్, డిసెంబర్ 2, ప్రభాతవార్త:**




మండలంలోని నామినేషన్ కేంద్రాలను జిల్లా పంచాయతీ పరిశీలకురాలు అయోషా మస్రత్ ఖానం పరిశీలించారు. మండలంలో నామినేషన్ కేంద్రాలు ఎనిమిది క్లస్టర్లుగా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. నామినేషన్ చివరి రోజు మంగళవారం చించోలి(బి) క్లస్టర్‌ను పరిశీలించిన పరిశీలకురాలు, నామినేషన్ వేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో తెలుసుకున్నారు. నామినేషన్ పత్రాలు పూర్తిగా పరిశీలించి స్వీకరించాలని నామినేషన్ కేంద్రంలో ఉన్న అధికారులకు సూచించారు. ఏవైనా ఇబ్బందులు కలిగితే వెంటనే తెలియజేయాలని ఎంపీడీవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత్, అధికారి రాజేష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

### - బిజెపి మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్

**బజార్‌హత్నూర్, డిసెంబర్ 02, ప్రభాతవార్త:**

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామని బజార్‌హత్నూర్ బిజెపి మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో మంగళవారం బిజెపి మండల నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలానికి చెందిన సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలన్నీ బిజెపి కైవసం చేసుకుంటుందని దీమా వ్యక్తం చేశారు. అన్ని సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను గెలుపే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని, ప్రతీ కార్యకర్త, నాయకులు అందుకు తగినట్లుగా కృషి చేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని యువ నాయకుడు సిడాం వికాస్‌ని బిజెపి కండువ కప్పి పార్టీలో సాధారంగా ఆహ్వానించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వ పథకాలు, బిజెపి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితమై తాను బిజెపిలో చేరానని వికాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి సభ్యుడు కొత్త శంకర్, సూది నంది నర్సయ్య, బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ కన్వీనర్ గాజుల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.






అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

## చెత్తను కాల్చొద్దని అవగాహన ర్యాలీ

**బజార్ హత్నూర్, డిసెంబర్ 02, ప్రభాతవార్త:**

పర్యావరణ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం శ్రీ సరస్వతి శిశు మందిర్ ఆధ్వర్యంలో చెత్తను కాల్చొద్దని సందేశంతో గోడపత్రాలను విడుదల చేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన వీధుల్లో గోడ పత్రాలను అతికిస్తూ అవగాహన కల్పించారు. వీధుల్లో చెత్తను కాల్చడం ఆరోగ్యానికి హానికరమని, తడి-పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేయాలని విద్యార్థులు నినాదాలు చేశారు. నీటిని పొదుపుగా వినియోగించాలి, మొక్కలు నాటి సంరక్షించాలి, ప్లాస్టిక్ వినియోగం తగ్గించి బట్ట సంచులను వాడాలి అనే విషయాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు వోర్ని వెంకటరమణ, పర్యావరణ ప్రముఖ్ మెస్రం వైష్ణవి, పాఠశాల ఆచార్య బృందం పాల్గొన్నారు.

## జిల్లాను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 2, ప్రభాతవార్త:**



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్

కుమురం భీం జిల్లా పేరును అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. నవంబర్ 28, 29 తేదీలలో రంగారెడ్డి జిల్లా పఠాన్ చెరువు ప్రాంతంలో జరిగిన 44వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఖో ఖో పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిన ఆసిఫాబాద్ గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాల విద్యార్థినులను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, సహాయ గిరిజన అభివృద్ధి అధికారి శివకృష్ణ లతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థినులు క్రమశిక్షణ, సామర్థ్యం, కఠోర శ్రమతో తర్ఫీదు పొంది విజయం సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని తెలిపారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శిక్షణ అందించిన కోచ్ లు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసిఎంఓ ఉద్ధవ్, జిసిడిఓ శకుంతల, క్రీడా అధికారి షేక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింబారావు, పిడి మీనా రెడ్డి, వసతి గ్రహ సంక్షేమ అధికారి సాయి బాబా, శిక్షకులు తిరుమల్, విద్యాసాగర్, అరవింద్, రాకేష్ పాల్గొన్నారు.

## అయ్యప్ప భక్తుల కోసం సిర్పూర్ కాగజ్ నగర్ నుంచి కొల్లాం జంక్షన్ వరకు ప్రత్యేక రైలు సౌకర్యం

### - సిర్పూర్ శాసన సభ్యుడు డా.పాల్వాయి హరీష్ బాబు

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 2, ప్రభాతవార్త :**

అయ్యప్ప మాల దీక్ష తీసుకుని శబరిమల వెళ్ళే భక్తుల సౌకర్యార్థం కాగజ్‌నగర్ నుంచి కొల్లాం జంక్షన్ వరకు ఈనెల 13వ తేదీ శనివారం ప్రత్యేక రైలు నడిపిస్తున్నట్లు సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాస్తవను శబరిమలకు ప్రత్యేక రైలు నడపాలని కోరవడంతో దానికి అనుగుణంగా ఈ నెలలో ప్రత్యేక రైలు నడపనున్నారని తెలిపారు. ఈ రైలు కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం,పెద్దపల్లి,జమ్మికుంట,వరంగల్ మీదుగా కొల్లాం జంక్షన్ చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ,స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయని తెలిపారు. మకరజ్యోతి దర్శనానికి వెళ్ళే భక్తుల సౌకర్యార్థం కూడా ప్రత్యేక రైలు నడపాల్సిందిగా రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అయ్యప్ప భక్తులు ఈ ప్రత్యేక రైలు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



## బీజేపీ మద్దతుదారులను గెలిపించాలి

### - రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్

**లక్షెట్టిపేట, డిసెంబర్ 02, ప్రభాతవార్త**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారులను గెలిపించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ కోరారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం లక్షెట్టిపేటలోని సూరారం, పాత కొమ్ముగూడెం గ్రామాలలో ఆయన పర్యటించారు. బీజేపీ మద్దతుదారులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.. ఈ కార్యక్రమంలో మండలం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణాపూర్ ఓసీ ఫేజ్-2 పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సిద్ధతల పరిశీలన

**రామకృష్ణాపూర్, డిసెంబర్ 2, ప్రభాతవార్త**

రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ (ఫేజ్-02) ప్రాజెక్టుకు సంబంధించి రేపు ఉదయం 10.30 గంటలకు ఓసి మహాలక్ష్మి కంపెనీ సమీపంలో జరగనున్న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాట్లను ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కోరారు. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అమలు ద్వారా రామకృష్ణాపూర్ ప్రాంతానికి పూర్వ వైభవం తిరిగి వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు.తదనంతరం ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించిన జీఎం, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు అందించారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, డీజీఎం (పర్సనల్) అశోక్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎం (ఐఈడి) కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేయాలి

### ★ జిల్లా ఎస్పీ నితికా పంత్ ★ అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ తనిఖీ

**సిర్పూర్ (టి), డిసెంబర్ 2, ప్రభాతవార్త :**

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేయాలని లక్ష్యంగా జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ మంగళవారం అంతర్‌రాష్ట్ర సరిహద్దులో సిర్పూర్ (టీ) మండలంలోని వెంకట్రావుపేట వద్ద ఏర్పాటు చేసిన ఎస్.ఎస్.టీ (ఇంటర్ స్టేట్ చెక్‌పోస్ట్)లను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలకు సంబంధించిన రిజిస్టర్‌లను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్ట్ వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, విధులలో ఉన్న సిబ్బంది సరైన డ్యూటీ రోస్టర్ ప్రకారం క్రమబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, అక్రమ మద్యం మరియు ఇతర నిషేధిత వస్తువుల రవాణా అయ్యే అవకాశం ఉంటుందని, చెక్‌పోస్ట్ నందు డ్యూటీలో ఉన్న అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి అని ఎస్పీ గారు స్పష్టం చేశారు. ప్రతీ వాహనం మరియు వ్యక్తిని కచ్చితంగా, క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే వదిలిపెట్టాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ గారు ఆదేశించారు. ఎన్నికలను స్వచ్ఛంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అహర్నిశలు కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఏ విధమైన రవాణా జరగకుండా కట్టుదిట్టమైన తనిఖీలు కొనసాగించాలని ఎస్పీ నితిక పంత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీ లో ఎస్పీ వెంట కాగజ్నగర్ డి.ఎస్.పి వాహిదుద్దీన్, సిర్పూర్ (టి) ఎస్.ఐ సురేష్ కుమార్ పాల్గొన్నారు.



వెంకట్రావ్ పేట్ చెక్‌పోస్ట్ తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ నితికా పంత్

# విద్యార్థులకు షి టీమ్, మహిళా చట్టాలపై అవగాహన

**బెల్లంపల్లి, డిసెంబర్ 02, ప్రభాతవార్త**

రామగుండం కమిషనరేట్ మహిళలు, విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంచిర్యాల జిల్లా షీ టీం ఎస్ఐ హైమ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహం, బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలిపినారు. విద్యార్థులకు పోక్సో చట్టం, ఈవ్ టీజింగ్, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నియమాలు, టి సేఫ్ యాప్ మరియు షీ టీమ్‌లపై సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి, లక్ష్యాలను చేరుకోవాలని తెలిపినారు. ఎస్ఐ హైమ మాట్లాడుతూ పోక్సో చట్టం అనేది లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే భారతీయ చట్టం అని,పిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడం కోసం పోక్సో చట్టాన్ని రూపొందించింది అని, వికృత చేష్టలతో పిల్లలు జీవించే హక్కును హరించిన వారికి ఈ చట్టం కఠినంగా శిక్షిస్తుంది అని,శారీరకంగా, మానసికంగా వారిని వేధిస్తే నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటారు అని, 2012లో వచ్చిన ఈ ఫోక్సో చట్టం 18 ఏళ్లలోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుంది అని వారిపై అత్యాచారానికి పాల్పడే నిందితులకు కఠినమైన శిక్షలతో పాటు మరణశిక్ష కూడా విధిస్తారు అని అవగాహన కల్పించడం జరిగింది. ఈవ్ టీజింగ్ విద్యార్థినులు ఆకతాయిల వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా వెంటనే డయల్ 100కు లేదా షీ టీమ్ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వేధింపులను నిర్లక్ష్యం చేయకుండా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. గుడ్ టచ్-బ్యాడ్ టచ్ చిన్నపిల్లలు శరీర భాగాలపై ఎవరైనా అపరిచితులు అనుచితంగా తాకినప్పుడు లేదా ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తించినప్పుడు అది బ్యాడ్ టచ్ అని గ్రహించి, వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని వివరించారు. విద్యార్థినులు, మహిళల భద్రత కోసం టి సేఫ్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, అత్యవసర పరిస్థితుల్లో దానిని ఉపయోగించే విధానం గురించి వివరించారు. షీ టీమ్ సేవలు, వాటి ఉద్దేశాన్ని గురించి వివరిస్తూ,ఎప్పుడూ అందుబాటులో ఉండే డయల్ 100 లేదా రామగుండం షి టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల షి టీమ్ నంబర్ 8712659385 అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిడి చాతరాజుల దుర్గాప్రసాద్, ఏఎస్హెచ్ఓ ఎఫ్ఎసి ధర్మానంద్ గౌడ్, ఏఎస్హెచ్ఓ ప్రశాంత్, మంచిర్యాల జిల్లా షి టీమ్ సిబ్బంది మహిళా కానిస్టేబుల్ జ్యోతి, కానిస్టేబుల్ శ్రవణ్ , వసతి గృహం సంక్షేమ అధికారులు విజయలక్ష్మి, సుజాత, నిక్కత్, విద్యార్థులు పాల్గొన్నారు.



# నేటి నుంచి మూడో విడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

### - 28 గ్రామ పంచాయతీలు - తొమ్మిది నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 2, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలో మూడో విడతలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారం (నేటి)నుంచి ప్రారంభం కానున్నది. దీనికి సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. మండలంలోని 28 గ్రామాలకు గాను తొమ్మిది నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఉజ్వల్‌కుమార్ తెలిపారు. భట్టుపల్లి క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందవెల్లి,బోడెపల్లి,జగన్నాథ్‌పూర్, భట్టుపల్లి, వంజిరి క్లస్టర్‌లో బారెగూడ, అంకుసాపూర్,వంజిరి, చింతగూడ క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈస్గాం, కోయవాగు, చింతగూడ, నజ్రూల్‌నగర్ క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బసంతినగర్, రాంనగర్ ఎన్, దుర్గానగర్,నజ్రూల్‌నగర్, నాగంపేట క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వల్లకొండ, రాస్పల్లి,కొత్తసారసాల, నాగంపేట్, మోసం క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కడంబా, గన్నారం,అన్‌కోడ, మోసం,కోసిని క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బురుదగూడ, ఎన్‌జీఓఎస్ కాలనీ, రేగులగూడ, కోసిని, మాలిని క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో లైన్‌గూడ, మాలిని గ్రామాలకు చెందిన సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే వారు సంబంధిత కేంద్రాల్లో నామినేషన్లు వేయనున్నట్లున్ల ఎంపీడీఓ తెలిపారు.



# పక్కాగా లెక్క..!

- పంచాయతీ ఎన్నికల వ్యయ పరిమితి ఖరారు
- జనాభా ప్రాతిపదికన ప్రచారానికి ఖర్చు
- క్షుణ్ణంగా పరిశీలించనున్న అధికారులు




**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 2, ప్రభాతవార్త :**

పంచాయతీ సంగ్రామం మొదలైంది. బరిలో నిలబడే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓటర్లను మభ్య పెట్టేందుకు డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేయడానికి వీలు లేదు. ఇందుకుగాను ఎన్నికల సంఘం వ్యయ పరిమితిని విధించింది. అభ్యర్థుల ఖర్చులను అధికారులు ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. లెక్కకు మించి ఖర్చు చేస్తే వేటు పడే అవకాశం ఉంది. జనాభా ప్రాతిపదికన అభ్యర్థులు ప్రచారానికి డబ్బులు ఖర్చు చేయాలి. సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు బరిలో నిలబడే అభ్య ర్థులు బ్యాంకు ఖాతా వివరాలను నామినేషన్ పత్రాలతో పాటే సమర్పించాలి. నూతన పంచాయ తీరాజ్ పట్టం ప్రకారం ఐదువేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థి రూ 2.50 లక్షలు,వార్డు సభ్యులు రూ.50 వేలకు మించి ఖర్చు చేయకూడదు. ఐదు వేల లోపు గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థి రూ.1.50 లక్షలు, వార్డు సభ్యులు రూ.30 వేలకు మించి ఖర్చు చేయకూడదు.

### వివరాల నమోదు..

అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో ప్రచారానికి ఖర్చును ఏ రూపంలో నిల్వచేసుకున్నారో వివరాలను పొందుపరుస్తూ పత్రాలను రిటర్నింగ్ అధికారికి దాఖలు చేయాలి. అయితే రిటర్నింగ్ అధికారి ఎన్నికల ఖర్చుకు సంబంధించి ప్రచార,వ్యయ పుస్తకాలను అందించడం, ఆమేలగూడ తండా పంచాయతీ కార్యాలయంపుస్తకాల్లో ఖర్చులను ఎప్పటికప్పుడు నమోదు చేయించాల్సి ఉంటుంది.

### మూడు విడతలుగా తనిఖీలు...

స్థానిక సంస్థల ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల ప్రచారఖర్చుకు సంబంధించి ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు లెక్కలను పరిశీలిస్తుంటారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేసింది మొదలుకొని పోలింగ్ ముగిసే వరకు అధికారులు వ్యయాన్ని మూడు దఫాలుగా తనిఖీలు చేస్తారు. ఇందుకు అభ్యర్థులు ఖర్చులను పుస్తకాల్లో ఏ రోజుకారోజు నమోదు చేసుకోవాలి. ఎన్నికల్లో ధన ప్రవాహన్ని అడ్డుకోవడానికి ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ప్రత్యేకంగా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో అభ్యర్థుల ప్రచార శైలిని ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటుంది. ఇందుకు ప్రతి మండలానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపనుంది.

### ఖర్చు మించితే వేటు తప్పదు..

బరిలో నిలబడే అభ్యర్థులు ఎన్నికల సంఘం సూచించిన విధంగా ప్రచారానికి ఖర్చు చేయాల్సి ఉంటుంది. అలా కాకుండా ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేయడానికి వీలులేదు. ప్రచార ఖర్చు వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు చూపించాలి. అభ్యర్థులు వ్యయ పరిమితి మించినా, ప్రచార ఖర్చుల లెక్కలు చూపించకపోయినా వారిపై అధికారులు చర్యలు తీసుకుంటారు. ఎన్నికల్లో గెలిచినా పదవి నుంచి తొలగించే అవకా శాలు ఉంటాయి. కాబట్టి అభ్యర్థులూ జరజాగ్రత్త.

### నిబంధనలు పాటించాలి : ఉజ్వల్ కుమార్ ఎంపీడీఓ, కాగజ్‌నగర్

ఎన్నికల బరిలో నిలబడే అభ్యర్థులు నిబంధనలకు లోబడి ఖర్చు చేయాలి. జనాభా ప్రాతిపదికన ఎన్నికల సంఘం ఖర్చును నిర్ణయించింది. ఎన్నికల్లో ఇష్టం వచ్చినట్లు డబ్బులు ఖర్చు చేయడానికి వీలు లేదు. ఎప్పటికప్పుడు లెక్కలు చూయించాలి.

## చెక్‌పోస్ట్‌ల వద్ద నిఘా ఉండాలి

**తాండూర్, ప్రభాతవార్త**



చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ మనోజ్

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండలంలోని రేపల్లెవాడ వద్ద ఏర్పాటు చేసిన మంచిర్యాల ఆసిఫాబాద్ జిల్లాల అంతరాష్ట్రల సరిహద్దు చెక్ పోస్టు ను మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు అంతరాష్ట్ర రహదారి గుండా అక్రమ మద్యం, డబ్బు, కానుకలు రవాణా కాకుండా గట్టి నిఘా ఉంచాలని పోలీసులకు సూచించారు. వారి వెంట తహసిల్దార్ జ్యోత్స్న, నాయబ్ తహసిల్దార్ కల్పన ఉన్నారు.

## కాంగ్రెస్ అధ్యక్ష పదవుల బాధ్యతలు స్వీకరణ

**ఉట్నూర్, డిసెంబర్ 2, ప్రభాతవార్త:**




హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన కార్యనిర్వాహక సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష బాధ్యతలను నరేష్ జాదవ్, ఆశీఫాబాద్ కొమురంభీం జిల్లా కమిటీ అధ్యక్షురాలిగా ఆత్రం సుగుణ నియామక పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు కృషి చేసి, జిల్లాల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి పనిచేస్తామని తెలిపారు. తర్వాత డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు నూతన అధ్యక్షులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.

## ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించాలి

**- మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య**

**తాండూర్, డిసెంబర్ 2, ప్రభాతవార్త :**

రైతుల నుంచి కొనుగోళ్లు చేసిన వరి ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు తరలించాలని మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య అన్నారు. బోయపల్లి బోర్డు వద్ద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కొనుగోళ్ల కేంద్రాలలోనే ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు దాన్యం కొనుగోళ్ల కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ జ్యోత్స్న, పిఎసిఎస్ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది అనిల్, తదితరులు పాల్గొన్నారు.





## నామినేషన్ పత్రాలను క్షుణంగా పరిశీలించాలి

**- బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్**

**తాండూర్, డిసెంబర్ 2, ప్రభాతవార్త :**

అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను అధికారులు క్షుణంగా పరిశీలించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ సూచించారు. మాదారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని మంగళవారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థుల దాఖలు చేసిన నామినేషన్ పత్రాల పరిశీలనలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని సూచించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ అనిల్ కుమార్, సెక్రెటరీ సౌందర్య ఉన్నారు.